ఆపరేషన్ రోప్ కొందరికేనా..?

చిరు వ్యాపారులపైనే ప్రతాపం! | బడాబాబులను పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు | సర్వత్రా విమర్శలు

రాంగోపాల్‌పేట్: నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు తీసుకువచ్చిన ఆపరేషన్ రోప్ పనితీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో వాహనాల రాకపోకలు, పాదాచారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఇటీవల ఆపరేషన్ రోప్‌ను ప్రారంభించారు. అయితే దీనిని అందరికీ వర్తింపజేయాల్సిన ట్రాఫిక్ పోలీసులు కేవలం చిరు వ్యాపారులపైనే ప్రతాపం చూపిస్తూ బడా వ్యాపారులను మాత్రం వదిలేస్తున్నారనే విమర్శలు వ్యక్తం వ్యక్తమవుతున్నాయి.

చిరు వ్యాపారులపైనే..

ఉత్తర మండలం పరిధిలోని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మోండా మార్కెట్ కీలకమైన ప్రాంతాలు. నిత్యం ఇక్కడ వాహనాల రాకపోకలతో రోడ్లు కిక్కిరిసి ఉంటాయి. దీనికి తోడు రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారం చేస్తుండడంతో సమస్య మరింత జఠిలంగా మారుతోంది. అయితే ఇటీవల ట్రాఫిక్ పోలీసులు ఇక్కడి ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. మోండా మార్కెట్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ప్యారడైజ్, సింధీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్ వ్యాపారాలను తీసివేశారు. అయితే కొన్ని బడా, బడా సంస్థల ఎదుట అక్రమ వాహనాల పార్కింగ్‌లను అలాగే వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మినిస్టర్ రోడ్డులో కిమ్స్ ఆస్పత్రి ఎదుట పదుల సంఖ్యలో చిరు వ్యాపారాలను తొలగించారు. ఇప్పుడు ఆస్పత్రి యాజమాన్యం ఫుట్‌పాత్‌తో పాటు రోడ్డును ఆక్రమించి కార్లు, ద్విచక్ర వాహనాలు, అంబులెన్సులు యథేచ్ఛగా రోడ్లపైనే నిలుపుతున్నారు. ఎన్టీఆర్ విగ్రహం నుంచి మినిస్టర్ రోడ్డులో కార్ల యాక్ససరీస్ షాపుల యజమానులు, ఫుట్‌పాతే కాకుండా రోడ్డును సైతం ఆక్రమించి తమ వ్యాపారాలు సాగిస్తున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. రాణిగంజ్ లాంటి ముఖ్యమైన వ్యాపార ప్రాంతంలోనూ షాపుల ఎదుట సామగ్రిని, వాహనాల పార్కింగ్‌ను అలాగే వదలిపెట్టారు. దీంతో ఇక్కడ నిత్యం ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు కేవలం చిరు వ్యాపారులపై ప్రతాపం చూపించి బడా బాబులను వదలిపెట్టడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఓ హోటల్ ఎదుట రోడ్డు మీదే నిలిపిన వాహనాలు


మినిస్టర్ రోడ్‌లో కార్ యాక్ససరీస్ షాపుల యజమానులు ఆక్రమించిన ఫుట్‌పాత్, రోడ్డు

ప్రతిరోజూ నియంత్రిస్తున్నాం..

బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతిరోజు ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా రోడ్డు మీద వాహనాలు పార్కింగ్ చేసినా, ట్రాఫిక్ అవాంతరాలు కలిగించిన చలాన్లు విధిస్తున్నాం.
– బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య

హుండీ కానుకల లెక్కింపు


వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ డబ్బులను లెక్కిస్తున్న సిబ్బంది

చిక్కడపల్లి: వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం హుండీ కానుకలను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో లెక్కించారు. 42 రోజులకు గాను రూ.2,37,606 ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. దేవాలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం పునరుద్ధరణ కమిటీ చైర్మన్ జానకీసుధాకర్, కార్యనిర్వహణ అధికారి ఎం.దేవనాథం, ప్రధాన అర్చకులు బుగ్గా లక్ష్మీపతి శర్మ, కందాళ వెంకటాద్రి, సభ్యులు శ్యాం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం


నియామక పత్రం అందుకుంటున్న సంగీత

కాచిగూడ: బీసీ మహిళా గ్రేటర్ హైదరాబాద్ కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా పెద్దిగారి సంగీత నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య గురువారం ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు గుజ్జ కృష్ణ, గుండేటి శంకర్, అవినాష్, తంగెళ్లముడి నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పర్యవేక్షణ


కాచిగూడలో పనులను పరిశీలించి మాట్లాడుతున్న కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: లింగంపల్లిలోని కర్ణాటక సాహిత్య మందిర్ లేన్‌లో నూతనంగా రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. కార్పొరేటర్ ఉమారాణి గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పనులను పర్యవేక్షించారు. అనంతరం బస్తీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రశాంత్, బీజేపీ నాయకలు బల్వీర్, ఆరవింద్, హజారిబాబు, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రామకృష్ణ, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అవినాష్ కాలేజీపై కమిషనర్‌కు ఫిర్యాదు


కమిషనర్ సీవీ ఆనంద్‌కు ఫిర్యాదు చేస్తున్న నరేందర్‌గౌడ్

కాచిగూడ: విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న అవినాష్ కామర్స్ కాలేజీపై తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ గురువారం సీపీ సీవీ ఆనంద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆర్థిక ఇబ్బందులతో ఫీజులు కట్టలేని విద్యార్థులను పరీక్షలకు హాజరు కానివ్వడం లేదన్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారని తెలిపారు. పిల్లల భవిష్యత్ తమ చేతుల్లో ఉందని కళాశాల యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు గణపతి, బిక్కు మహారాజ్, ఎర్ర శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో వాలెంటైన్స్ డేను నిషేధించాలి


కాచిగూడలోని బజరంగ్ సేన కార్యాలయంలో మాట్లాడుతున్న ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు

కాచిగూడ: వాలెంటైన్స్ డేను తెలంగాణలో రద్దు చేయాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ ఆర్ లక్ష్మణ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడలోని బజరంగ్ సేన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వాలెంటైన్స్ డే పేరుతో చేపట్టే అశ్లీల కార్యకాలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. రాత్రి 11గంటల తర్వాత నగరంలోని హోటళ్లు, పబ్బులు, బార్లను మూసివేసేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్లకు వినతి పత్రాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్, రామేశ్వర్ మిశ్రా, వాణీప్రియ, ఆశిష్‌సింగ్, పీయూష్, ఆశిష్, తదితరులు పాల్గొన్నారు.

వేగం కన్నా ప్రాణం మిన్నా..

అంబేడ్కర్ విద్యాసంస్థల డైరెక్టర్ డా. విష్ణుప్రియ


అంబేడ్కర్ లా కళాశాల ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీపై ర్యాలీ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వేగం కన్నా ప్రాణం మిన్నా.. అని ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించి ప్రాణాలను రక్షించుకోవాలని అంబేడ్కర్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ అన్నారు. గురువారం అంబేడ్కర్ లా కళాశాల ఎన్‌సీసీ యూనిట్, నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విష్ణుప్రియ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ డ్రైవింగ్‌లో రోడ్ సేఫ్టీపై అవగాహన పెంచుకోవాలన్నారు. మితిమీరిన వేగం తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు సంకటంగా మారుతుందన్నారు. ఇప్పుడు ఉన్న సమాజంలో ప్రతి ఒక్కరి జీవన విధానంలో ఫోన్ ఒక భాగమైపోయిందన్నారు. అలాగే వాహనాలు నడిపే వారు హెల్మెట్‌ను భాగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన, ఎన్‌సీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ వరలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల నుండి బాగ్‌లింగంపల్లి సుందరయ్యపార్కు వరకు ర్యాలీ నిర్వహించారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించాలి

డీఎస్పీ నాయకుడు సంతోష్

కవాడిగూడ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించి అమలు చేయాలని డీఎస్పీ కవాడిగూడ ఇన్‌చార్జి సంతోష్ మహారాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కవాడిగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... దేశ జనాభాలో సగభాగం ఉన్న బహుజనులకు జనాభా దామాషా పద్ధతిన రిజర్వేషన్లు ఇవ్వకపోవడం వారి హక్కులకు భంగం కలిగించడమేనని అన్నారు. రెండోసారి కులగణన చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల బీసీలపై అగ్రకుల ప్రభుత్వ పెద్దలకు ఉన్న చిత్తశుద్ధి ఎంటో బహిర్గతం అయిందన్నారు. డెడికేషన్ కమిషన్ పేరుతో కాలయాపన చేయొద్దన్నారు. వెంటనే స్థానిక సంస్థలకు నోటిఫికేషన్ ప్రకటించాలని కోరారు. 42శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

నోటా ప్రజాస్వామ్యానికి ఆక్సిజన్ లాంటింది



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్

పంజగుట్ట: నోటా ప్రజాస్వామ్యానికి ఆక్సిజన్ లాంటిందని అఖిల భారత నోటా రాజ్యాంగ ముసాయిదా సభ చైర్మన్ పి.సౌద అరుణ్, ప్రధాన కార్యదర్శి బి.జగదీశ్వరరావు పేర్కొన్నారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2014లో నోటాకు కూడా గుర్తు ఉండాలని తానే న్యాయస్థానంలో పిల్ వేశానని దీంతో నోటాకు గుర్తు కేటాయించారని గుర్తుచేశారు. 2032లో దేశంలో సుమారు 100 నియోజకవర్గాల్లో నోటా మొదటి స్థానంలో వచ్చే అవకాశం ఉందన్నారు. నోటా మొదటిస్థానంలో ఉంటే ఎన్నికలు రద్దు చేసి తిరిగి నిర్వహిస్తే ఆ ఖర్చుకూడా ప్రజలపైనే పడుతుందన్నారు. అందుకే ద్వితీయ స్థానంలో వచ్చిన వ్యక్తికి సగం అధికారం నోటా కమిటీకి సగం అధికారం ఇస్తే ఇద్దరూ కలిసి నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడుతారని పేర్కొన్నారు.

మహనీయులను స్మరించుకోవాలి

లిబర్టీ: దేశం కోసం పాటుపడిన మహనీయులను స్మరించుకోవాలని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పి.వి.రాజేశ్వరరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో సరోజినినాయుడు జయంతిని గురువారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. స్వాతంత్ర సమరయోధురరాలిగా, కవియిత్రిగా సరోజినినాయుడు పేరు పొందారని కొనియాడారు. సమావేశంలో సౌభాగ్యవతి, పి.వి.శ్రీనివాస్‌రావు, రేవంత్, సంకీర్త తదితరులు పాల్గొన్నారు.

యువ క్రీడాకారిణికి సత్కారం

లిబర్టీ: యువ క్రికెట్ క్రీడాకారిణి ధృతి కేసరిని పలువురు ప్రముఖులు గురువారం సత్కరించారు. బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందించి సత్కారం చేసి అభినందించారు. కార్యక్రమంలో మాజీ క్రికెట్ క్రీడాకారులు అజారుద్దీన్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వి.కృష్ణమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా అధ్యక్షుడి చర్యలు దుర్మార్గం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనలో నాయకులు

లిబర్టీ: అమెరికాలోని విదేశీయులపై అక్కడి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం నాయకులు పేర్కొన్నారు. సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విదేశీయులపై అమెరికా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ మానవ హక్కులకు అంతర్జాతీయ న్యాయ సూత్రాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ గురువారం ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐపీఎస్ జాతీయ నేత కె.యాదవరెడ్డి, జాతీయ అధ్యక్షవర్గ సభ్యులు, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, కేవీఎల్, జి.నాగేశ్వర్‌రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాలల నిరసన ప్రదర్శనలు

మాల మహానాడు జాతీయ గౌరవ అధ్యక్షుడు కృష్ణస్వరూప్

కాచిగూడ: తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన ఎస్సీ వర్గీకరణను తక్షణమే రద్దు చేయాలని మాల మహానాడు జాతీయ గౌరవ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. ఈనెల 14వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అంబేడ్కర్ విగ్రహాల వద్ద మాలల నిరసన ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఎస్సీ జాబితాలోని 57 కులాలకు రిజర్వేషన్ అవకాశాలు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మెజారిటీ దళిత కులాలకు అన్యాయం చేసిందన్నారు. మాలలను తక్కువ జనాభాగా చూపించి ద్రోహం చేసిందని ఆరోపించారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం

కాచిగూడ: తెలంగాణ మున్నూరుకాపు మహాసభ జీవితకాల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామని రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ కోరారు. కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో సభ్యత్వ నమోదు దరఖాస్తులు తీసుకోవాలని అన్నారు. మున్నూరుకాపులు అందరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

ఫీజుల పేరిట వేధించే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఫీజుల పేరుతో విద్యార్థులను వేధించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఓయూలో గురువారం ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్, టెక్నో, ఒలింపియాడ్ తదితర స్కూల్స్, కాలేజీల్లో తరచూ ఫీజుల కోసం వేధింపుల ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచి వసూలు చేయడం వలన పేద మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బూర శ్రీనివాస్, చంద్రమోహన్ రాయ్, శ్రీనునాయక్, గోదా రవీంద్ర, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



లాలాపేట: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 12న మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తార్నాక స్ట్రీట్ నంబర్-10 లోని మంగళదీప్ హార్డ్‌వేర్ షాపు నిర్వాహకుడు ధర్మారం చౌదరి షాపు ఎదుట ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి పడి ఉండగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో తార్నాకలో పెట్రోలింగ్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్స్ నరేశ్, ప్రమోద్ వెంటనే అక్కడికి చేరుకుని 108 అంబులెన్స్‌ను పిలిపించారు. సిబ్బంది వెళ్లి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడిడి దాదాపు 52 ఏళ్లు ఉంటాయని వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవీ రమణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు 42శాతం ఇవ్వడానికి చట్టబద్ధత కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ తెలిపారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో రమణ మాట్లాడుతూ... కులగణన సర్వేలో పాల్గొనని వారికి ఈనెల 16 నుంచి 28 వరకు మరో అవకాశం కల్పించినందున ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించాలన్నారు. మార్చిలో జరగే అసెంబ్లీ సమావేశాలలో 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని తీర్మానం పెడుతామని అన్నారు. అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులను ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పిన మాటలు నిలబెట్టుకోవాలని కోరారు. బీసీలకు విద్యా, ఉద్యోగాలలో కల్పించిన విధంగా స్థానిక సంస్థల్లో ఏ,బీ,సీ,డీ వర్గీకరణ చేయాలని కోరారు. సర్వే పూర్తయిన తరువాత కులాల వారీగా పూర్తి వివరాలు, ఆర్థిక సామాజిక రాజకీయ పరిస్థితులపై సమగ్ర సమాచారాన్ని ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

శ్రీరామమూర్తికి జీవిత సాఫల్య పురస్కారం


శ్రీరామమూర్తికి పురస్కారం ప్రదానం చేస్తున్న ఆచార్య నిత్యానందరావు

చిక్కడపల్లి: తెలంగాణలో నవ చైతన్య మూలమైన అఘోరనాథ చటర్జీ తొలి బాలిక పాఠశాలను ప్రారంభించిన మహనీయుడని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానందరావు అన్నారు. ఆయన కుమార్తెగా సరోజినీ నాయుడు మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో గురువారం కమలాకర చారిటబుల్ ట్రస్ట్, కమలాకర లలిత కళా భారతి నిర్వహణలో డాక్టర్ సరోజినీ నాయుడు జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సాహితివేత్త చిమ్మపూడి శ్రీరామమూర్తికి జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితివేత్త డా. వోలేటి పార్వతీశం మాట్లాడుతూ.. సరోజినీ నాయుడు కవయిత్రి స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న యోధురాలని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి పురస్కార గ్రహీతలను అభినందించారు.

నియోజకవర్గంలో రోడ్ల సమగ్రాభివృద్ధికి కృషి


అజీజియా మసీద్ లైన్‌లో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: నియోజకవర్గంలో ప్రజల అసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం అంబర్‌పేట డివిజన్‌లోని అజీజియా మసీదు లైనులో రూ.22లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మౌలిక సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన పనులు చేపడుతున్నామని అన్నారు. నియోజకవర్గంలోని బస్తీలు, కాలనీల్లో సౌకర్యాల కల్పనే ధ్యేయంగా చొరవ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పార్కులు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఆధునీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం కార్పొరేటర్‌తో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, చంద్రమోహన్, శ్రీరాములు ముదిరాజ్, రమేశ్‌నాయక్, శ్రీనివాస్, మిర్యాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలి



చిలకలగూడ: వేసవిలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ సూచించారు. జలమండలి అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనిచేయని పవర్, హ్యాండ్‌బోర్ల వివరాలు అందిస్తే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తామన్నారు. నామాలగుండు ప్రాంతంలో కలుషిత జలాలు సరఫరా అవుతున్నట్లు ఫిర్యాదు రావడంతో ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరడంతో సమస్య ఉత్పన్నమైనట్లు గుర్తించారు. నూతన పైప్‌లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. ఆమె వెంట జలమండలి సెక్షన్ మేనేజర్ కుషాల్ ఉన్నారు.

తక్షశిలా పబ్లిక్ స్కూల్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

లాలాపేట: శాంతినగర్ లాలాగూడలోని తక్షశిలా పబ్లిక్ స్కూల్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ కమ్యూనిటీ అవుట్ రీచ్ అనే ప్రతిష్టాత్మకమైన అవార్డును కైవసం చేసుకుంది. ఈ మేరకు క్యూ ఆండ్ ఐ టు డే ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన ఎడ్యుకేషన్ కాంక్లేవ్‌లో స్కూల్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల, విద్యార్థుల ఉన్నతికి తాము అందిస్తున్న సేవలకు గాను అవార్డు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా అవార్డు అందజేసిన క్యూ అండ్ ఐకి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎరుకల సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలి


మాజీ మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న ఎరుకల సంఘం నాయకులు

లాలాపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం ఎరుకల సామాజిక వర్గానికి అన్ని రాజకీయ పార్టీలు సరైన ప్రాతినిధ్యం కల్పించాలని ఆదివాసీ ఎరుకల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఆయనను సన్మానించారు. అనంతరం సంఘం కేలండర్‌ను హరీశ్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎరుకల ఆత్మగౌరవ భవనం, పందులు పెంపకందారులకు ఎంపవర్‌మెంట్ స్కీం కింద రూ.60 కోట్లు కేటాయించిందని, వాటిని యధావిధిగా కొనసాగేలా ప్రభుత్వంతో మాట్లాడాలని కోరామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఎరుకల సామాజిక వర్గాన్ని గుర్తించి గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని విన్నవించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, కుతాడి రవికుమార్, కోనేటి నర్సింహ, వనం రమేశ్, నాగులు, మొగులయ్య, రవి, నరేశ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో టీపీసీసీ కార్యదర్శి గజ్జెల రుషికేశ్వర్ మృతి



గజ్జెల రుషికేశ్వర్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి తదితరులు

ముషీరాబాద్: టీపీసీసీ కార్యదర్శి గజ్జెల రుషికేశ్వర్ (75) అనారోగ్యంతో మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీలో నాలుగు దశాబ్దాలుగా పని చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన మృతి చెందినట్లు సమాచారం తెలియగానే వ్యవసాయ సంక్షేమ శాఖ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, టీపీసీసీ కార్యదర్శి జీఎన్‌కేశవ్, మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పనాయాదవ్, వాజీద్‌హుస్సేన్ రాంనగర్‌లోని మృతుడి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా రుషికేశ్వర్ కుటుంబీకులను పరామర్శించి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం 12గంటలకు బన్సీలాల్‌పేట శ్మశానవాటికలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.